

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం: 38.0
కనిష్ఠం: 21.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:26 (శుక్ర)
సహరీ: 4:33 (శని)

కూటమి వ్యూహాత్మకం



ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరులో జరుగుతున్న రోడ్ షోలో చంద్రబాబు

ఆటంకాలను అధిగమించి.. ఉమ్మడిగా ప్రచారం

ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాల్లో ఉమ్మడి కూటమి కుదురుకుంది. ముందస్తు ఆటంకాలను పూర్తిగా అధిగమించింది. పరస్పర సమన్వయంతో అభ్యర్థులు ప్రచారంలోకి ముందున్నారు. నియోజకవర్గాల వారీగా ఆత్మీయ కలయికలు ఉమ్మడి కూటమికి బాగా కలిసి వచ్చింది. పోలింగ్ గడువు సమీపిస్తున్న తరుణంలో గ్రామ గ్రామాన నిలదొక్కుకోవడానికి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. దీనికితోడు పార్టీల అధినేతలు గోదావరి జిల్లా వైపు దూసుకువస్తున్నారు.

ఆత్మీయ కలయికలతో మరింత బంధం

- గోదావరి వైపు పార్టీల అధినేతల చూపు
- నేడు టీడీపీ అధినేత చంద్రబాబు రాక
- పాలకొల్లు, నరసాపురంలో సభలకు హాజరు
- వైసీపీ నుంచి కూటమి వైపు వలసలు
- అధికార పార్టీలో కలహాల కాపురాలు

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

కూటమి ఇప్పటికే ఉమ్మడి వ్యూహాలకు దిగింది. కలిసికట్టుగా ప్రచారం చేస్తూనే వ్యూహాలు రూపొందించి అమల్లోనూ జాగ్రత్త పడుతున్నారు. ఈ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని 14 అసెంబ్లీ స్థానాలను దక్కించుకోవాలన్న లక్ష్యంలో భాగంగానే ఇప్పటికే వడివడిగా అడుగులు వేస్తున్నారు. కీలక నియోజకవర్గాల్లో పార్టీ ఎన్నికల రణభేరి మోగించటం వాటికి అనుగుణంగా అధినేతలను రప్పించడం కేడర్‌లో మరింత ఉత్సాహం నూరిపోయడం వంటివి ప్రధాన లక్ష్యంగా కనిపిస్తున్నాయి. చంద్రబాబు పర్యటనలోనూ భారీ ఎత్తున జనసమీకరణలో జనం హాజరయ్యేలా జాగ్రత్త పడుతున్నారు. వాస్తవానికి అధికార వైసీపీకి తీవ్ర వ్యతిరేకత కొట్టొచ్చినట్టు కనిపించడం, లోతట్టు గ్రామాల్లోను ఈ తరహా ఛాయలు కనిపిస్తుండడం తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి అభ్యర్థులకు మనోధైర్యాన్ని ఇచ్చింది. తగ్గట్లుగానే గడప గడపకు వెళ్ళి ఓటర్లను కలుస్తున్నారు. ప్రత్యేకించి ఏ ఒక్క వర్గాన్ని వదులుకోకుండా జాగ్రత్తలు పడుతున్నారు. ఓ వైపు ఎన్నికల నియమావళిని పాటిస్తూనే ఎక్కడా ఉల్లంఘనలకు తావు లేకుండా ప్రచార ఒరవడిని ఉధృతం చేశారు. శుక్రవారం జరగనున్న చంద్రబాబు ఎన్నికల ప్రచారం అనంతరం మరింత ఊపు పెరుగుతుందని ఆ పార్టీ వర్గాలు ధీమాతో ఉన్నాయి. కేవలం అభిమానులతోనే ఎన్నికల సభకు హాజరయ్యేలా అందరికి పిలుపునిచ్చారే తప్ప వైసీపీ సభల మాదిరిగా తరలింపునకు దిగడం లేదు. మహిళలు, రైతులు, యువకులు పెద్ద ఎత్తున ఎవరంతట వారే ఏర్పాట్లు చేసుకుని చంద్రబాబు సభకు తరలి రావడానికి ఇప్పటికే సిద్ధమయ్యారు. ఇప్పటి వరకు జగన్ ప్రభుత్వం పై వాగ్బాణాలు సంధిస్తూ వచ్చిన చంద్రబాబు పనిలో పనిగా స్థానిక వైసీపీ నాయకత్వంపైన విరుచుకుపడుతూనే ఉన్నారు. ఇంకోవైపు జనసేన పవన్ కల్యాణ్ సైతం త్వరలోనే పశ్చిమ పర్యటనకు వచ్చే అవకాశం ఉంది. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, సమాంతరంగా జగన్ బస్సుయాత్ర త్వరలోనే ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు రానున్నాయి. వచ్చే రెండు వారాలు పార్టీ అధినేతల పర్యటనలతో దద్దరిల్లబోతున్నాయి.

కలిసొచ్చిన ఆత్మీయ కలయికలు

మూడు పార్టీలు ఉమ్మడిగా ఎన్నికల బరిలోకి దిగాయో అప్పటి నుంచే అధికార వైసీపీకి గుబులు పుట్టించింది. వీరంతా ఉమ్మడిగా కదులుతుంటే వీరిని ఎదుర్కొనలేక చాలా నియోజకవర్గాల్లో వైసీపీ తడబడే పరిస్థితి వచ్చింది. ఆత్మీయ కలయికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన నియోజకవర్గ స్థాయి నేతలతోపాటు మండల, గ్రామ స్థాయి నేతలు పాల్గొంటూ ఉండడంతో ఎన్నికల వ్యూహం అమలుకు సులువైంది. దీనికి తగ్గట్లుగానే ఎక్కడా పొరపొచ్చాలు, భేదాభిప్రాయాలు తలెత్తకుండా, పరస్పర సమన్వయంతోనే ఈ మూడు పార్టీల కమిటీలు ఎక్కడికక్కడ బాధ్యతలు భుజాన ఎత్తుకున్నాయి. తొలుత కొంత గ్యాప్ వచ్చినా రాను రాను అది పూర్తిగా సమసిపోవడం కూటమిలో ఆనందానికి దారితీసింది. ఏలూరు లోక్‌సభ ఉమ్మడి అభ్యర్థిగా పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, నరసాపురం లోక్‌సభ ఉమ్మడి అభ్యర్థిగా భూపతిరాజు శ్రీనివాసవర్మ అభ్యర్థిత్వాల ప్రకటన ఆలస్యమైనా వీరందర్నీ కూడబలుక్కొని ఆత్మీయ కలయికల పేరుతో సరికొత్త ట్రెండ్ సృష్టిస్తున్నారు. ఎంపీ అభ్యర్థులకు ఇదొక ప్లస్ పాయింట్. అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థులు, ఎంపీ అభ్యర్థులు ఒక తేదీ నిర్ణయించుకుని ఆ మేరకు నియోజకవర్గాల పర్యటనల్లో కలియ తిరుగుతున్నారు.

వైసీపీలో కలహాల కాపురం

ఉమ్మడి అభ్యర్థులు పరస్పర సమన్వయంతో ప్రచారంలో ముందంజలో ఉండగా చింతలపూడి వంటి నియోజక వర్గాల్లో అధికార వైసీపీలో కలహాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నియోజకవర్గంలో ఒక మండలంలో అంతర్గత కలహాలు విచ్చలవిడిగా సాగి కొంత చల్లారితే, తిరిగి మరో మండలంలో రాజుకుంటున్నాయి. కామవరపుకోట మండలంలో ఒక చిన్న వివాదం ఆ పార్టీ నేతల్లో రాజీనామాలకు దారితీసింది. పోటీ చేస్తున్న అభ్యర్థి, స్థానిక నాయకత్వం మధ్య అగాధం ఏర్పడటమే దీనికి ప్రధాన కారణం. అది కూడా కాక పార్టీ నేతల మధ్య పరస్పర సమన్వయం కొరవడడం విభేదాలకు, దూషణలకు, ఆఖరికి వ్యక్తిగత దాడులకు దారితీస్తోంది. దీన్ని సర్దుబాటు చేసేందుకు వైసీపీ నాయకత్వం ముప్పుతిప్పలు పడుతోంది. చాలా నియోజకవర్గాల్లో ప్రచారంలో ముందుగా హడావుడి చేసి ఈ మధ్యనే ప్రచారంలో స్పీడ్ తగ్గింది. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు గ్రామ గ్రామానికి తిరిగిన వైసీపీ నేతలు ఇప్పుడు మళ్లీ తిరిగి ఆరంభించారు. ఈలోపే కూటమి కుదురుకుని మూకుమ్మడిగా ప్రచారానికి దిగుతుండడం అధికార వైసీపీకి మింగుడు పడటం లేదు.

రాటు తేలిన జనసేన

ఉమ్మడి పొత్తులో భాగంగా ఉంగుటూరు నుంచి పచ్చమట్ల ధర్మరాజు, తాడేపల్లిగూడెం నుంచి బొలిశెట్టి శ్రీనివాస్, భీమవరం నుంచి అంజిబాబు, పోలవరం నుంచి చిర్రి బాలరాజు, నరసాపురం నుంచి నాయకర్ అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీకి దిగారు. ఈ నియోజక వర్గాల్లో తెలుగుదేశం పూర్తి సమన్వయంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో జనసేన ప్రచారంలో రాటు తేలింది. ఎక్కడికక్కడ స్థానిక సమస్యలు ప్రస్తావిస్తూ అందరినీ కలుపుకుపోతూ మారుమూల గ్రామాల్లోనూ ఓటర్లకు నేరుగా పరిచయమవుతున్నారు. త్వరలోనే పవన్ కల్యాణ్ ఈ నియోజకవర్గాల్లో పర్యటించనుండటం దీనికి తగ్గట్టుగానే టీడీపీ అధినేత చంద్రబాబు ప్రచారానికి హాజరు కానుండటం కలిసొచ్చే అంశాలు.

టీడీపీలో మరింత విశ్వాసం

తెలుగుదేశం నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఈ మధ్యన విశ్వాసం మరింత పెరిగింది. చింతలపూడి నుంచి సొంగా రోషన్‌కుమార్, ఏలూరు నుంచి బడేటి చంటి తొలిసారిగా ఎన్నికల బరిలో దిగుతున్నారు. మిగతా తెలుగుదేశం పక్షాన బరిలోకి దిగిన వారంతా రాజకీయాల్లో రాటు తేలినవారే. రాజకీయాల్లో అత్యంత సీనియర్లుగా వున్న పితాని సత్యనారాయణ ఆచంట నుంచి, డాక్టర్ కామినేని శ్రీనివాస్ కైకలూరు నుంచి, చింతమనేని ప్రభాకర్ దెందులూరు నుంచి నిమ్మల రామానాయుడు పాలకొల్లు నుంచి, కొలుసు పార్థసారధి నూజివీడు నుంచి, ఆరిమిల్లి రాధాకృష్ణ తణుకు నుంచి ఎన్నికల బరిలో ప్రత్యర్థులను అధిగమించేందుకు వ్యూహ ప్రతి వ్యూహాలకు పదును పెడుతున్నారు. మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నా తాడేపల్లిగూడెం, తణుకు నియోజక వర్గాల్లో కూటమి అభ్యర్థులు ఏ పరిస్థితుల్లోనూ పైచేయి సాధించాల్సిందే అన్నట్టుగా కూటమి నాయకత్వాలు ఇప్పటికే మరింత చొరవ తీసుకుంటున్నాయి. ఉండి నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రామరాజు రెండోసారి పోటీ చేస్తున్నారు.

ఊపునిస్తున్న చేరికలు

ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాల పరిధిలో అధికార వైసీపీని వీడి సీనియర్లు అందరూ కూటమిలో చేరిపోతున్నారు. కీలక నియోజక వర్గాలు అన్నింటిలోనూ ఈ చేరికలు భారీగానే ఉన్నాయి. అధికార వైసీపీకి గండి కొట్టేలా లేకపోలేదు. ఏలూరులో సీనియర్ నేత ఎం.ఆర్.డి బలరామ్ దంపతులు తాజాగా వైసీపీకి రాజీనామా చేశారు. నేడో రేపో టీడీపీలో చేరబోతున్నారు. దెందులూరులో మరికొందరు చింతమనేని ప్రభాకర్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఇలా వరుసగా అన్ని నియోజకవర్గాల్లోనూ వైసీపీ నుంచి కూటమిలోకి వలసలు పెరగడం రానున్న ఫలితాలకు ముందస్తు సంకేతంగా భావిస్తున్నారు.



నరసాపురంలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు

నరసాపురం టు పాలకొల్లు

చంద్రబాబు రోడ్ షో.. భారీ సభలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి):

టీడీపీ అధినేత చంద్రబాబు చేపట్టిన 'ప్రజాగళం' యాత్ర శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లా చేరుకోనుంది. నర్సాపురం, పాలకొల్లు పట్టణాల్లో నిర్వహించే రోడ్ షోలు, బహిరంగ సభల్లో పాల్గొంటారు. వీటిని విజయవంతం చేసేలా టీడీపీ నాయకులు సన్నాహాలు చేస్తున్నారు. కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో గురువారం పర్యటించిన ఆయన రాత్రికి నల్లజర్లలో బసచేశారు. శుక్రవారం ఆ పార్టీ నాయకులతో సమీక్షించి మధ్యాహ్నం రెండు గంటలకు హెలీకాప్టర్ ద్వారా మధ్యాహ్నం 2.30 గంటలకు నర్సాపురంలోని స్వర్ణాంధ్ర కళాశాలకు చేరుకుంటారు. అక్కడి విద్యార్థులతో ముచ్చటించే అవకాశం ఉంది. స్టీమర్ రోడ్డులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించే బహిరంగ సభ వరకు రోడ్ షో నిర్వహిస్తారు. మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సభలో మాట్లాడతారు. తర్వాత రోడ్డు మార్గంలో పాలకొల్లు చేరుకుని, గాంధీ బొమ్మ సెంటర్‌లో 5.15 గంటలకు నిర్వహించే బహిరంగ సభలో మాట్లాడతారు. రాత్రికి పాలకొల్లులోనే బస చేస్తారు. ఈ రెండు సభలకు భారీగా జనం హాజరు కానున్నారని పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టు ఏర్పాట్లుచేశారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులను ప్రకటించిన తర్వాత చంద్రబాబు తొలిసారి జిల్లాలో పర్యటిస్తున్నారు. ఇటీవల ఆచంటలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో, తాడేపల్లిగూడెంలో జరిగిన టీడీపీ-జనసేన జెండా సభలోను పాల్గొన్నారు. సభల ఏర్పాట్లను తెలుగుదేశం జోన్-2 ఇన్‌చార్జ్ మందలపు రవి, జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మండలి మాజీ చైర్మన్ షరీఫ్ పర్యవేక్షించారు.



బాబు కోసం ఎదురుచూపు : షరీఫ్

నరసాపురం, ఏప్రిల్ 4 : చంద్రబాబు సభ కోసం తీర ప్రాంత ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ అన్నారు. నరసాపురం స్టీమర్ రోడ్‌లో శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు జరగనున్న ప్రజాగళం బహిరంగ సభ ఏర్పాట్లను ఇన్‌చార్జ్ రామరాజుతో కలిసి గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈసారి ఎన్ని హామీలు, తాయిలాలు ఇచ్చినా ప్రజలు వైసీపీ మాటలను నమ్మే స్థితిలో లేరన్నారు. నరసాపురం కూటమి ఎంపీ, పార్లమెంట్ పరిధిలోని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. జక్కం శ్రీమన్నారాయణ, పాలూరి బాబ్జీ, కొప్పాడ రవి, సుభాష్, ఆకన సుబ్రహ్మణ్యం, పద్మారావు పాల్గొన్నారు.

భారీగా తరలిరండి : నిమ్మల



పాలకొల్లు టౌన్, ఏప్రిల్ 4 : రాష్ట్రంలో జగన్ అరాచక, నియంత పాలనకు విముక్తి కలిగించాలంటూ టీడీపీ అధినేత చంద్రబాబు పాలకొల్లులో శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు చేపట్టే ప్రజాగళం సభకు అన్నివర్గాల ప్రజలు భారీగా రానున్నారని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు చెప్పారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్ హెలీప్యాడ్ ప్రాంతం నుంచి గాంధీ బొమ్మల సెంటర్‌లో జరిగే సభా స్థలి వరకు రోడ్ షో జరుగుతుందన్నారు. రైతులు, యువత, మహిళలు, ఉద్యోగులు, కార్మికులు, ఎస్సీ, బీసీ ఇలా అన్ని వర్గాల ప్రజలు జగన్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జగన్‌ను గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జనసేన, టీడీపీ నాయకులు బోనం వెంకట నరసయ్య, పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో ఎంపీ రఘురామకు స్వాగతం పలుకుతున్న టీడీపీ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్

విజయం సాధించా

నరసాపురం ఎంపీ రఘురామరాజు

భీమవరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి):'నేను విజయం సాధించా. జగన్‌ను ఓడిపోయే స్థితికి తీసుకునివచ్చా. ప్రస్తుత ప్రభుత్వంలో అన్యాయాలు ఒక్క భీమవరానికే పరిమితం కాలేదు. రాష్ట్రమంతటా ఉన్నాయి. ప్రజలు చైతన్యవంతులయ్యారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా బయటకు వస్తున్నారు' అని నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు అన్నారు. హైదరాబాద్‌లోవున్న ఆయన గురువారం తాడేపల్లిగూడెం, పిప్పర, యండగండి మీదుగా భీమవరం విచ్చేశారు. ప్రతిచోట తెలుగుదేశం, జనసేన నాయకులు, అభిమానులు ఎంపీకి సాదర స్వాగతం పలికారు. భీమవరంలో జనసేన నిర్వహించిన క్షత్రియ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. 'గతంలో భీమవరం వస్తే పట్టుమని నలుగురు కూడా రాలేని పరిస్థితి ఉండేది. ఇప్పుడు మారింది. జనసేన అభ్యర్థి అంజిబాబు వంటి పెద్ద మనిషి కోసం అంతా రావడం సంతోషకరమన్నారు. తెలుగుదేశం - బీజేపీ - జనసేన కూటమి విజయం సాధించాలి' అని ఆకాంక్షించారు. సమావేశంలో పెద్ద సంఖ్యలో క్షత్రియులు, అభిమానులు పాల్గొన్నారు.



భీమవరంలో కూటమి శిబిరాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షురాలు సీతారామలక్ష్మి, అంజిబాబు

ప్రశాంత భీమవరాన్ని సాధించుకుందాం

భీమవరం టౌన్, ఏప్రిల్ 4: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థిని గెలిపించి ప్రశాంత వాతావరణంలో వుండే భీమవరాన్ని సాధించుకుందామని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి పిలుపునిచ్చారు. భీమవరంలో కూటమి పార్టీల శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే జనసేన అభ్యర్థి పులపర్తి రామాంజనేయులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'జగన్ పాలనలో అంతా అరాచకమే జరిగింది. అందరిపైన అనేక విధాలుగా కేసులు పెడుతూ ఇబ్బందులకు గురిచేసింది. ఈ సందర్భాల్లో ప్రతి కార్యకర్త సైనికుల్లా నిలబడ్డారు. వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు తథ్యం. జిల్లాలో అందరూ గెలుపు గుర్రలేనని అన్నారు. అభ్యర్థి అంజిబాబు మాట్లాడుతూ గత పాలనలో తీవ్రంగా నష్టపోయాం. రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి లేదు. ఎక్కడ చూసినా అవినీతి, అరాచకం. మాఫియాలతో రాష్ట్రం కూరుకుపోయింది. మళ్ళీ అభివృద్ధి కావాలంటే కూటమి విజయంతోనే సాధ్యం' అని అన్నారు. ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని, కూటమి విజయానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. మెంటే పార్థసారధి, చెన్నమల చంద్రశేఖర్, కోళ్ల నాగేశ్వరరావు, పులపర్తి ప్రశాంత్, యిర్రింకి సూర్యారావు, రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో మీడియా సెంటర్ ప్రారంభం



భీమవరం టౌన్, ఏప్రిల్ 4 : ఎన్నికల సందర్భంగా భీమవరం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన మీడియా సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఎన్నికల సమాచారాన్ని మీడియాకు అందించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి వివిధ మార్గాల్లో వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నాం. ఇప్పటి వరకు రూ.54.06 లక్షలు నగదు, రూ.8.28 లక్షల విలువైన మద్యం, వివిధ రకాల వస్తువులను సీజ్ చేశాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపైన చర్యలు తీసుకుంటున్నాం' అని తెలిపారు. జేసీ సి.వి.ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, సమాచార పౌర సంబంధాల శాఖాధికారి టి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలకు లోబడి కరపత్రాలు, వాల్ పోస్టర్లు ముద్రించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లాలోని ప్రింటర్ల సమావేశంలో ముద్రణ విషయమై పాటించాల్సిన నిబంధనలను వివరించారు.

జిల్లాలో 86.85 శాతం మందికి పెన్షన్‌లు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పెన్షన్ లబ్ధిదారులకు సచివాలయాల వద్ద వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. జిల్లావ్యాప్తంగా అన్ని సచివాలయాల్లోనూ పెన్షన్ పంపిణీకి జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు. మొత్తంపైన 86.85 శాతం మందికి పెన్షన్‌లు ఇవ్వగలిగారు. అదే ఇంటికి వెళ్లి ఇచ్చినా సరే రెండు రోజుల్లో పూర్తయ్యేది. కేవలం వలంటీర్లపై నెపం పెట్టి ప్రభుత్వం సచివాలయాల వద్ద పెన్షన్‌లు ఇచ్చేందుకు ఆదేశాలు జారీచేసింది. పెన్షన్‌ల పంపిణీలో వలంటీర్లు దూరంగా ఉండాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. దీనిని షాకుగా చూపి రాష్ట్ర ప్రభుత్వం ఇంటికి పెన్షన్ ఇవ్వకుండా అవాంతరాలు సృష్టించింది. కొన్ని సచివాలయాల్లో సరైన వసతులు కల్పించలేదు. ప్రభుత్వ ఖాజానాలో సొమ్ములు లేకపోవడంతో మూడు రోజుల ఆలస్యంగా పంపిణీ ప్రారంభించారు. జిల్లాలో 2,34,384 మంది లబ్ధిదారులుంటే సుమారు 1,98,000 మందికి గురువారం నాటికి పంపిణీ చేశారు. ప్రభుత్వం రూ.67.29 కోట్లు పెన్షన్ కోసం విడుదల చేసింది. మరో రూ.1.19 కోట్లు బ్యాంకులకు జమ చేయాల్సి ఉంది.

వైసీపీకి భారీ షాక్.. ఎంఆర్డీ బలరామ్ దంపతుల రాజీనామా

ఏలూరు రూరల్, ఏప్రిల్ 4 : ఏలూరులో వైసీపీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఆ పార్టీలో ఇప్పటి వరకు కీలకంగా వ్యవహరించిన మధ్యాహ్నపు బలరామ్, ఈశ్వరి దంపతులు పార్టీని వీడుతున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీకి అనివార్య కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్టు ఆ లేఖలో పేర్కొన్నారు. పాలకొల్లు నియోజకవర్గ అబ్జర్వర్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు బలరామ్ ప్రకటించారు. ఎంఆర్డీ ఈశ్వరీ బలరామ్ ఈడా చైర్మన్‌గా మూడేళ్ల ఆ పదవిలో కొనసాగారు. కొంత కాలంగా పార్టీకి బలరామ్ దంపతులు దూరంగా ఉన్నారు. శుక్రవారం నరసాపురం వస్తున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్నట్టు సమాచారం. ఏలూరు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ రామకృష్ణ తన పదవితోపాటు వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు గురువారం పార్టీకి లేఖ పంపారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన పార్టీకి విశేష సేవలు అందించారు. ఇటీవల కొంతకాలంగా పార్టీకి దూరంగా ఉన్నారు.

బైక్‌పై నగదు తరలింపు

ఏడు లక్షలు సీజ్

జిల్లాలో భారీగా న్యాయాధికారుల బదిలీలు

- వివరాలు 7లో

నిమ్మ అ'ధర'హో..

- కిలో నిమ్మ రూ.70
- రైతుల్లో ఆనందం
- 30 లారీలకు పడిన ఎగుమతులు



మార్కెట్‌లో నిమ్మ ధరలు అమాంతం పెరిగాయి. వేసవి రావడం.. ఎండలు పెరగడంతో వీటి అవసరమూ పెరిగింది. ఈ కారణంగా కిలో రూ.45 పలికే వీటి ధరలు రూ.70కు చేరడంతో రైతుల పంట పండింది. -7లో



వేగవరం చెక్‌పోస్టు వద్ద సీజ్ చేసిన రూ.7లక్షలు

రూ.10,17,100 సీజ్

జంగారెడ్డిగూడెం/ కామవరపుకోట/ భీమడోలు /గణపవరం, ఏప్రిల్ 4 :సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలవుతున్న తరుణంలో అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. వేగవరం ఎస్ఎస్‌టి చెక్‌పోస్టు వద్ద గురువారం వాహన తనిఖీలు చేస్తుండగా జంగా రెడ్డిగూడెం వైపు వస్తున్న ఒక స్కూటీలో రూ.7 లక్షల నగదు ఎస్ఎస్‌టీ టీం, ఫ్లైయింగ్ స్క్వాడ్ గుర్తిం చారు. ఎటువంటి బిల్స్ చూపించక పోవ డంతో సీజ్ చేసి ట్రెజరీకి తరలించినట్లు జంగా రెడ్డి గూడెం ఎస్ఐ జ్యోతిబస్ తెలిపారు. ఎన్నికల కోడ్‌అమలులో ఉన్న నేపథ్యంలో రూ.50 వేలు పైబడి నగదు తీసుకువెళ్తే దానికి సంబంధించిన బిల్లులు కచ్చితంగా ఉండాలని ఎస్ఐ తెలిపారు.

- కామవరపుకోట పంచాయతీ కొత్తూరు చెక్‌పోస్టు వద్ద తనిఖీలలో భాగంగా గురువారం చింతలపూడికి చెందిన వ్యక్తి నుంచి రూ. 76,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఎంఆర్‌వో రమేష్, డీటీ ఎండీ మొహిద్దీన్, తడికలపూడి ఎస్ఐ జయబాబు, స్క్వాడ్ అధికారి సత్యవేణి, వీఆర్‌వో బాబూరావు, ఉన్నారు.
- భీమడోలు మండలం పోలసానపల్లిలో నిర్వహించిన తనిఖీల్లో అధికారులు రెండు లక్షల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. భీమడోలు సీఐ రవికుమార్, సీఎస్‌డీటీ మాధవరావు, తదితరులు పోలసానపల్లి హైవేపై నిర్వహించిన తనిఖీల్లో కారులో రెండు లక్షల రూపాయలు గుర్తించి స్వాధీనపర్చుకున్నామన్నారు.
- గణపవరంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ నిర్వహించి తనిఖీల్లో రూ.లక్ష 40,500 నగదు సీజ్ చేసినట్లు ఏలూరు ఆర్‌డీవో ఎస్ఎస్‌కే ఖజావలి తెలిపారు.స్వాధీనం చేసుకున్న నగదును ట్రెజరీలో అప్పగించామన్నారు.

23.72 లీటర్ల మద్యం స్వాధీనం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 4 : సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా ఏడు వేల 950 రూపాయల విలువైన 23.72 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌లు తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న నగదు 10 లక్షల 40 వేల 500 రూపాయలు అని తెలిపారు.



సూపర్ ఐడియా !

ఎండలు మండిపోతున్నాయి. బయటకు అడుగు పెడదామంటే భయమేస్తోంది. ఎండ నుంచి రక్షణకు తమ బైక్‌లకు ఇలా గొడుగులు ఏర్పాటు చేసుకుని హాయిగా ప్రయాణిస్తున్నారు. ఏలూరులో కనిపించిన దృశ్యాలు ఇవి..

- ఫొటో గ్రాఫర్,ఏలూరు



ఇటు చూడండి సారూ..!

మొగల్తూరు మండలం కాళీపట్నం తూర్పు గ్రామ సచివాలయం సమీపంలో ఓహెచ్‌ఆర్ ట్యాంకులకు తాగునీటిని లిఫ్ట్ చేసే పైపులైన్‌కు రంధ్రాలు ఏర్పడటంతో ఐదు నెలలుగా కుళాయినీరు లీక్ అవుతోంది. దీంతో కాళీపట్నం తూర్పు, కొత్తోటల్లోని ఓహెచ్‌ఆర్ ట్యాంకులకు నీరు అందక రెండు పంచాయతీల్లోనూ నీటికోసం ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా సమస్య పరిష్కారం కాలేదని సర్పంచ్ మేడిద మాధవి ప్రభాకర్‌లు తెలిపారు.

- మొగల్తూరు



నిమ్మ అధరహో..



కిలో నిమ్మ రూ.70 ..రైతుల్లో ఆనందం

తగ్గిన పంట విస్తీర్ణం..దిగుబడిపై ప్రభావం

పెదవేగి, ఏప్రిల్ 4 : నిమ్మ రైతుల పంట పండింది. ధరలు రైతుల ఆశలకు అనుగుణంగా ఉండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులుగా నిమ్మకాయల ధర కిలో రూ.50 నుంచి రూ.70 మధ్య నిలకడగా ఉంది. దీంతో రైతులు ఆనందంతో ఉక్కిరి బిక్కిరయ్యారు. ఏటికేడాది నిమ్మకాయలకు గిట్టుబాటు ధరలేక అల్లాడుతుండగా నెలరోజులుగా ధర ఆశాజనకంగా ఉండడం హర్షించదగ్గ విషయమంటున్నారు. గతంలో ధర పెరిగినా వారం పదిరోజుల వరకే ఉండేది. కానీ ఇప్పుడు నెలరోజులుగా ధర నిలకడగా ఉండడం లాభదాయకమని రైతులు చెప్తున్నారు. పెరిగిన డిమాండ్, తగ్గిన దిగుబడి కారణంగానే నిమ్మకాయల ధర పెరిగిందని, ఈ ధర ఈ నెలాఖరు వరకు ఇలాగే కొనసాగితే అప్పుల కష్టాలు తీరిపోతాయని రైతులు ఆశతో ఉన్నారు. కాయలు లేనప్పుడు ధర ఎంత ఉంటే మాత్రం ఏం లాభమని కొంతమంది రైతులు నిరాసక్తత వ్యక్తం చేస్తున్నారు. రిటైల్ మార్కెట్‌లో కాయ ఒక్కింటికి నాలుగైదు రూపాయలకు విక్రయిస్తున్నారు. మొన్నటివరకు సరైన ధరలేక నిమ్మ తోట లను తెగనరికిన రైతులు ఇప్పుడు ఈ ధరను చూసి ఉసూరు మంటున్నారు. ఒక్క బస్తా (50 కిలోలు) తీసుకెళ్లినా ఆశించిన సొమ్ము వచ్చేది కదా అని మదనపడుతున్నారు.



యార్డులో ఎగుమతికి సిద్ధం చేస్తున్న హమాలీలు

30 లారీలకు పడిపోయిన ఎగుమతులు

మార్చి, ఏప్రిల్ నెలలో నిమ్మకాయలు దక్షిణభారతం నుంచి ఉత్తర భారత దేశానికి సాధారణంగా 200 వరకు లారీల సరుకు వెళ్ళేది. అలాంటిది ఇప్పుడు 30 లారీలకు పడిపోయింది. దిగుబడి గణనీయంగా తగ్గడంతో సరుకులేక ధర పెరిగింది. దిగుబడి తగ్గడానికి గత నవంబరులో పడిన వర్షాలే కొంత వరకు కారణం. ఈ వర్షంతో నిమ్మ పూత మొత్తం రాలి పోయింది. దిగుబడి తగ్గి మార్కెట్‌కు కాయలు రాక తగ్గిపోయింది. ధర పెరగడానికి ఇది కూడా ఒక కారణం. ఉత్తర భారతంలో నిమ్మకాయల వాడకం కూడా పెరిగింది. నెలన్నర రోజులుగా ధర నిలకడగా ఉంది.

85 శాతంపైగా రైతులకు మేలు



గతంలో ఎప్పుడూ కూడా ఇన్నిరోజులు ఇంతలా ధర ఉన్న దాఖలాలు లేవు. గట్టిగా రెండు, మూడు వారాలు ధర గరిష్టంగా ఉండేది. ఆ సమయంలో కాయలు ఉన్నవారు దాదాపుగా 25 నుంచి 30 శాతం మంది రైతులే లాభాలను అందుకునేవారు. కానీ ఈసారి 85 శాతం పైగా రైతులు గరిష్ట ధరను అందుకున్నారు..

- ఆలపాటి రంగారావు, దెందులూరు మార్కెట్‌యార్డు వర్తక సంఘం అధ్యక్షుడు, కొత్తపల్లి

పెరిగిన ఎగుమతులు



నెలన్నరగా కిలో రూ.45 నుంచి రూ.80 వరకు ధర లభిం చడం రైతుకు లాభదాయకం. ఇది ఇలాగే మరో 15 రోజుల వరకు ఉండే అవకాశం ఉంది. కొంత మంది రైతులు ధర లేనప్పుడు చెట్లను కొట్టేయడం, ధర ఉన్నప్పుడు మొక్కలు నాటడం అనేది చేస్తున్నారు. ఇది సరైన విధానం కాదు. సాగులో ఒడిదుడుకులు అనేవి సహజం. అన్నిటిని తట్టుకుని నిలబడితే ఎప్పటికైనా లాభమే ఉంటుంది..

- తాతా యశ్వంత్ రాజశేఖర్, వర్తక సంఘం సభ్యుడు, పెదవేగి

ఉపాధిహామీ పథకం అమలు చేయాలి



ఈ ఏడాది నిమ్మ కాయల దిగుబడి తగ్గింది. తక్కువ దిగు బడి వచ్చినా ధర బాగుండడంతో ఆశించిన ఆదాయం వచ్చింది. కానీ పెట్టుబడి మాత్రం పెరిగి పోయింది. ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులు పెరిగిపోయాయి. కిలో రూ.50లకు తగ్గకుండా ఉంటే లాభదాయకంగా ఉంటుంది. ప్రభుత్వం ఎరువులు, పురుగు మందులను రాయితీపై అందిస్తే రైతుకు మరింత మేలు జరుగుతుంది. ఉపాధిహామీ పథకంలో కూలీలు రైతుల పొలాల్లో పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- మారగాని ప్రసాద్, రైతు, లక్ష్మీపురం



రబీ ధాన్యం తూకం వేయిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

మద్దతు ధరకే ధాన్యం కొనుగోళ్లు

జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ శివరామ్

గణపవరం, ఏప్రిల్ 4: రబీ ధాన్యాన్ని రైతులు నేరుగా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జే.వెంక టేశ్వరరావు తెలిపారు. గురువారం సీహెచ్ అగ్రహారం రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోళ్ల ప్రారంభించారు. గణపవరం మండలంలో 48 వేల 311 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ ధాన్య మొత్తం అఖరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. గోనె సంచులు కొరత లేకుండా పంపిణీ చేస్తామన్నారు. జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ శివరామ్ మాట్లాడుతూ ధాన్యం రైతులు మద్దతు ధర కంటే బయట ఎక్కువ ధర వస్తున్నట్లయితే అమ్ముకోవచ్చన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. డీఎస్‌వో సరోజిని, ఏడీఏ మురళీకృష్ణ, ఏవో వైవీఎస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రుల వివరాలను ఆయుష్మాన్ భారత్‌లో నమోదు చెయ్యాలి : డీఎంహెచ్‌వో

భీమవరం టౌన్,ఏప్రిల్ 4 : జిల్లాలో ఉన్న అన్ని రకాల ప్రైవేట్ ఆసుపత్రులు యాజమాన్యాలు తమ ఆసుపత్రి వివరాలను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ సైట్‌లో నమోదు చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి.మహేశ్వరరావు సూచించారు. కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. భారత్ డిజిటల్ మిషన్‌లో భాగంగా నర్సింగ్‌హోంలు, క్లినిక్‌లు ఆన్‌లైన్‌లో నమోదు కావాలన్నారు. పనిచేసే డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది అందరూ ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. అలాకాని పక్షంలో నవోదయ ఐడీ క్రియేట్ చేసిన వారికే వైద్యం చేయడానికి అనుమతులు ఇస్తామన్నారు. ఇందుకోసం ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా టీబీ, లెప్రసీ ఎయిడ్స్ అధికారి డాక్టర్ బి.భానునాయక్, డీసీ ఆరోగ్యశ్రీ డాక్టర్ కీర్తి కిరణ్, పి.అనంతలక్ష్మి, వీఎస్‌ఆర్‌కె కుమారి తదితరులు పాల్గొన్నారు.

న్యాయాధికారుల బదిలీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 4 : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పలువురి సీనియర్ సివిల్ న్యాయాధికారులు, జిల్లా సెషన్స్ న్యాయాధికారులు బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 39 మంది సీనియర్ సివిల్ న్యాయాధికారులను, 30 మంది అదనపు జిల్లా న్యాయాధికారులను బదిలీ చేస్తూ హైకోర్టు గురువారం రాత్రి ఉత్తర్వులను జారీ చేసింది. పిఠాపురం సీనియర్ సివిల్ న్యాయాధికారిగా పనిచేస్తున్న మాధవిని, తాడేపల్లిగూడెం బదిలీ చేశారు. అనకాపల్లి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి గంగరాజును నర్సాపురంలో నియమించారు. ఏలూరు అడిషనల్ సివిల్ న్యాయాధికారి విజయను యలమంచిలి బదిలీ చేశారు. తాడే పల్లిగూడెం సివిల్ న్యాయాధికారి ప్రకాష్‌బాబును రాజ మహేంద్రవరం జిల్లా న్యాయసేవాధి కార సంస్థ కార్యదర్శిగా నియమించారు. చిత్తూరు ప్రిన్సిపల్ సివిల్ న్యాయాధికారి శ్రీనివాసమూర్తిని ఏలూరు ప్రిన్సిపల్ సివిల్ న్యాయాధికారిగా నియమించారు. ఏలూరు ప్రిన్సిపల్ సివిల్ న్యాయాధికారి బుల్లికృష్ణను ఏలూరు అడిషనల్ సివిల్ న్యాయాధికారి గా నియమించారు. ప్రకాశం పోక్సో కోర్టు సెషన్స్ న్యాయాధి కారి సోమశేఖర్‌ను భీమవరం పోక్సో కోర్టు సెషన్స్ న్యాయాధికారిగా నియమించారు. విజయనగరం నాల్గవ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి, ఎస్సీ ఎస్టీ కోర్టు న్యాయాధికారి షేక్ సికిందర్‌బాషాను తాడేపల్లి గూడెం 11వ అదనపు జిల్లా న్యాయాధికారిగా నియమించారు. ఏలూరులోని మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి రామ్‌గోపాల్‌ను తిరుపతి ఐదవ అదనపు సెషన్స్ న్యాయాధికారి, ఫ్యామిలీ కోర్టు న్యాయాధికారిగా నియ మించారు. భీమవరం మూడవ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికార్ణి శ్రీసత్యదేవిని విశాఖపట్టణంలోని ఎస్సీఎస్టీ కోర్టు, 11వ జిల్లా అదనపు సెషన్స్ న్యాయాధికారిగా నియమించారు.

దొంగలు... బాబోయ్ దొంగలు..

పెంటపాడు మండలంలో చోరీల జోరు

రాత్రయితే షాపుల తాళాలు పగులగొట్టి..

ఇంటి బయట బైక్‌లు, సైకిళ్లు మాయం

బెంబేలెత్తుతున్న ప్రజలు



పెంటపాడు, ఏప్రిల్ 4 : పెంటపాడు మండలంలో దొంగలు చెలరేగి పోతు న్నారు. రాత్రయితే చాలు షాపులపై పడి దొరికింది పట్టుకుపోతున్నారు. చూపుతున్నారు. ఇళ్ళ వద్ద బయట పెట్టుకున్న మోటార్‌సైకిళ్ళు, సైకిళ్లను మాయం చేస్తున్నారు. వాళ్ల కుక్కుర్తి ఏ స్థాయిలో ఉందంటే పూల కుండీలను కూడా వదలడం లేదు. పెంటపాడు పీహెచ్‌సీలో ఇటీవల దొంగతనం జరిగింది. బయట తలుపు తాళాలను పగులకొట్టి దొంగ లోపలికి ప్రవేశించాడు. అక్కడ ఏమీ దొరకక పోవడంతో ఆసుపత్రిలో ఉన్న దూది, ఇంజక్షన్‌లను నిప్పు పెట్టాడు. రికార్డులను కూడా ధ్వంసం చేసేందుకు ప్రయత్నం జరిగింది. పక్క రూంలోనే ఆసుపత్రికి సంబంధించిన ఆక్సిజన్ సిలెండర్లు ఉన్నాయి. మంటలు కొంచెం ఎక్కువైతే పెను ప్రమాదమే జరిగి ఉండేది. కే.పెంటపాడు గ్రామంలో ఒకే రోజు రాత్రి రెండు సిమ్మెంట్ షాపులలో దొంగతనాలు జరిగాయి. ఒకరే ఈ దొంగతనానికి పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. షాపు నకు పైన ఉన్న రేకులను తప్పించి దొంగ లోపలికి వెళ్ళి కౌంటర్‌లో ఉన్న నగదు తీసుకువెళ్ళి పోయాడు. ఒక షాపులో రూ.6 వేలు, మరొక షాపులో రూ.35 వేల వరకూ చోరీకి గురైనట్లు సమాచారం. పరిమెళ్ళ గ్రామంలో గ్రామ సర్పంచ్ మోటర్‌సైకిల్ తీసుకువెళ్ళిపోయారు. మండల కేంద్రమైన పెంటపాడులో పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. ఇంటి ముందు ఏం పెట్టుకున్నా తెల్లవారేసరికి ఉంటాయో లేదో అన్నట్లుగా పరిస్థితి తయారైంది. రాత్రి వేళల తాళాలు వేసి పెట్టుకున్న బైక్‌లు కూడా మాయమవుతున్న సంఘటనలు నెలకొన్నాయి. ఇంటి ముందు పెట్టిన పూలకుండీలను కూడా దొంగలు వదలడం లేదు. కాలేజ్ సెంటర్ సమీపంలో పలువురి ఇంటి బయట పెట్టుకున్న సైకిళ్ళు, మోటారు సైకిళ్లు మాయమయ్యాయి. పెంటపాడు గేటు సెంటర్ వద్ద ఒక ల్యాబ్ పక్కనే ఉన్న షాపుల్లో ఒకే రాత్రి దొంగతనాలు జరిగాయి. అయితే పెద్దగా నష్టం లేకపోవడంతో షాపు యజమానులు ఊపిరి తీసుకున్నారు. ఒకపక్క ఎన్నికల హడావుడి గ్రామాలలో కనిపిస్తుండగా సందట్లో సడేమియాగా దొంగతనాలు కూడా ఎక్కువైపోయాయి. పోలీసులు దృష్ట సారించి దొంగతనాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.





మధుసూదన్‌రెడ్డి, సత్యప్రసాద్‌లతో నిట్ ఆచార్యులు

విద్యార్థులు నూతన లోహాలపై పరిశోధనలు చేయాలి

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 4 : ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలలో భారత్ ప్రపంచదేశాలకు దీటుగా దూసుకెళ్తుందని శాస్త్రవేత్త, విశ్రాంత డైరక్టర్ (డిఫెన్స్ మెటలర్జికల్ రీసెర్చ్ లాబోరేటరీ-డీఆర్‌డీవో) డాక్టర్ జీ.మధుసూధనరెడ్డి అన్నారు. ఏపీ నిట్‌లో మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ విభాగం సహకారంతో మెటీరియల్స్ ఫర్ డిఫెన్స్ అండర్ ఏరోస్పేస్ అప్లికేషన్స్ అనే అంశంపై గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఎంఈ విభాగాధిపతి డాక్టర్ రఫీ మహ్మద్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ దేశ భద్రత, నిఘా వ్యవస్థకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. అంతరిక్షంలో ప్రయోగించే వాహనాల్లో అధిక ఉష్ణోగ్రత తట్టుకునే నూతన లోహాలపై స్వదేశీ పరిజ్ఞానంతో విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయని, విద్యార్థులు కూడా ఆ దిశగా ఆలోచనలు చేసి నూతన లోహాలపై పరిశోధనలు చేయాలన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు సంబంధించిన పరికరాలను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయికి భారత్ ఎదిగిందన్నారు. అనంతరం మదుసూధన్‌రెడ్డి, సత్యప్రసాద్‌లను శాలువా, మెమొంటోలతో సత్కరించారు. ఆచార్యులు డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ కిరణ్ తీపర్తి, డాక్టర్ వి.సందీప్ పాల్గొన్నారు.

నూజివీడు టీడీపీ కార్యాలయం వద్ద అధికారుల హడావుడి

నూజివీడు, ఏప్రిల్ 4: నూజివీడు తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఎన్ని కల నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయంటూ కార్యాలయ ప్రహరీకి ఏర్పాటు చేసిన బ్యానర్లను రెవెన్యూ అధికారులు గురువారం రాత్రి తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడ కొద్దిసేపు హడావుడి జరిగింది. రెవెన్యూ, పోలీస్ అధికారులతో టీడీపీ కార్యకర్తలు తమకు అనుమతిపత్రాలు ఉన్నాయంటూ చూపారు. ఈ సమాచారం అందుకున్న నూజివీడు ఆర్డీవో, ఆర్వో వై.భవానీశంకరి ఘటనా స్థలానికి చేరుకుని ఎన్నికల నిబంధనలను వివరించి సర్దుబాటు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతికి మించి ఏర్పాటు చేసిన బోర్డులను వెంటనే తొలగించి శనివారం ఉదయంలోగా బోర్డును కార్యాలయం వద్ద ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు.

ఇద్దరు పింఛన్‌దారుల మృతి



అప్పల నరసమ్మ (ఫైల్)



తిరుపతయ్య మృతదేహం

ఉంగుటూరు /చాట్రాయి, ఏప్రిల్ 4 : ఏలూరు జిల్లాలో వేర్వేరు కారణాలతో నలు గురు పింఛన్‌దారులు మృతి చెందారు. ఉంగుటూరు మండలం కైకరం గ్రామానికి చెందిన పింఛన్‌దారు జనపరెడ్డి అప్పల నరసమ్మ (78) అనే వృద్ధురాలు బుధవారం ఉదయం పింఛన్ కోసం గ్రామ సచివాలయం వద్దకు వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత సాయంత్రం ఇస్తారని చెప్పడంతో ఎండలో తిరిగి ఇంటికి వచ్చింది. సాయంత్రం మరల వెళ్లే క్రమంలో ఇప్పుడైనా ఇస్తారో.. లేదోనంటూ ఒత్తిడికి గురై ఇంట్లోనే ఆయాసం రావడంతో ఒక్కసారిగా నీరసించి కుప్పకూలి మృతి చెందింది. చాట్రాయి మండలం చీపురుగూడెం శివారు మేకలగూడెంకు చెందిన మేకల తిరుపతయ్య(70) బుధవారం పింఛను తీసుకోటానికి కిలోమీటరు దూరంలోని సచివాలయానికి ఎండలో కాలినడకన వెళ్లి ఇంటికి వచ్చాక వడ దెబ్బ కారణంగా అస్వస్థతకు గురైయ్యాడు. కుటుంబ సభ్యులు 108లో చింతలపూడి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. అతనికి భార్య ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

బస్ సౌకర్యం కల్పించండి

- జిల్లాల విభజన జరిగి రెండేళ్లు పూర్తి
- ఏలూరు వచ్చేందుకు ముదినేపల్లి మండల వాసుల పాట్లు

ముదినేపల్లి, ఏప్రిల్ 4 : కొత్త జిల్లాలు ఏర్పడి రెండేళ్ల గడిచినా ముదినేపల్లి మండలం నుంచి జిల్లా కేంద్రమైన ఏలూరుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పడలేదు. గురువారం నాటికి జిల్లాల పునర్విభజన జరిగి సరిగ్గా రెండేళ్లు. 2022 ఏప్రిల్ 4న కొత్త జిల్లాలు ఏర్పడగా, ఏలూరు లోక్‌సభ పరిధిలో ఉన్న కైకలూరు అసెంబ్లీ నియోజక వర్గం కృష్ణాజిల్లా నుంచి విడిపోయి ఏలూరు జిల్లాలో కలిసింది. కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంకు ముదినేపల్లి నుంచి సరాసరి బస్ సౌకర్యం ఉండేది. ఇప్పటికీ ఆ సౌకర్యం కొనసాగుతూనే ఉంది. కొత్త జిల్లా కేంద్రమైన ఏలూరుకు ఆర్టీసీ అధికారులు ముదినేపల్లి నుంచి సరాసరి బస్ సౌకర్యం కల్పించలేదు. అప్పటి నుంచి బస్ సర్వీస్ కోసం ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు ఏలూరు జిల్లా ప్రజారవాణా అధికారులను కలసి కోరినా నేటికీ ఫలితం లేదు. ముదినేపల్లి నుంచి ఏలూరుకు సరాసరి బస్ సౌకర్యం లేక మండలంలోని పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏలూరు వెళ్లేందుకు పలు గ్రామాల ప్రజలు గుడివాడ, కైకలూరు మీదుగా చుట్టూ తిరిగి బస్సులు మారుతూ వెళ్లాల్సి వస్తుంది. ఏలూరు నుంచి కైకలూరు, మండవల్లి మీదుగా ముదినేపల్లికి బస్ సర్వీస్‌ను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.





4-04-2024 పొగాకు ధరలు (రూ.) పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	241	230	238.55
జంగారెడ్డిగూడెం-1	242	235	239.95
జంగారెడ్డిగూడెం-2	241	235	239.82
కొయ్యలగూడెం	242	235	240.04
గోపాలపురం	242	235	240.24

క్రైం కార్నర్

మద్యానికి డబ్బులివ్వలేదని యువకుని ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఏప్రిల్ 4 : మద్యానికి బానిసైన ఒక యువకుడు మద్యం తాగడానికి సొమ్ములు ఇవ్వలేదని కోపగించుకుని తీవ్ర మనస్థాపానికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు మేదరవారి వీధినకు చెందిన నర్రా దుర్గాసాయి కార్తీక్ (19) తాగుడుకు బానిసఅయ్యాడు. డబ్బులు ఇవ్వనప్పుడల్లా చేతులు కోసుకుని బెదిరిస్తూ ఉంటాడు. అతనికి తాగడానికి డబ్బులు ఇవ్వలేదని బెదిరించి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని తల్లి నర్రా సత్యవతి ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టూటౌన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

కారు ఢీ కొని మహిళ మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 4 : స్నేహితుల వివాహ కార్యక్రమానికి హాజరై తిరిగి మోటారు సైకిల్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు మోటారు సైకిల్‌ను ఢీ కొనడంతో ఆ మహిళల అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త తీవ్ర గాయాలకు గురయ్యాడు. గన్నవరంలో సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న తాతాపూడి వెంకట రమణ ఆయన భార్య పద్మశ్రీ (57) కలిసి ఈనెల 3వ తేదీ రాత్రి భీమడోలులోని స్నేహితుల కుటుంబంలో జరిగిన వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. అర్ధరాత్రి మోటారు సైకిల్‌పై గన్నవరం వెళ్తున్నారు. మార్గమధ్యలో ఏలూరు సమీపంలోని మెయిన్ బైపాస్ ఏలూరు ఇంజనీరింగ్ కాలేజీ వద్ద వెనుక నుంచి అతి వేగంగా వస్తున్న కారు మోటారు సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో పద్మశ్రీ అక్కడికక్కడే మృతి చెందగా ఆమె భర్త తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఆయనను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఈసంఘటనపై ఏలూరు త్రిటౌన్ సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

బైక్‌పై నుంచి పడి యువకుడి మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 4 : పనిమీద తణుకు వెళ్ళి తిరిగి మోటారు సైకిల్‌పై తన ఊరికి వెళ్తుండగా మార్గమధ్యలో రోడ్డు ఐరన్ గ్రిల్స్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. గుంటూరుకు చెందిన అన్నవరపు పుష్పరాజు (21) ఈనెల 3వ తేదీ రాత్రి తణుకు వచ్చి తిరిగి బుధవారం అర్ధరాత్రి మోటారు సైకిల్‌పై గుంటూరు వెళుతుండగా ఏలూరు సమీపంలోని చొదిమెళ్ళ వద్ద వేగంగా వెళ్తున్న మోటారు సైకిల్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న ఐరన్ గ్రిల్స్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు త్రిటౌన్ పోలీసులకు అందడంతో త్రిటౌన్ సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- కాలి బూడిదైన రూ.3.60 లక్షల నగదు, ఐదు కాసుల బంగారం



చాట్రాయి, ఏప్రిల్4: చాట్రాయి మండలం తుమ్మగూడెంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల గురువారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించి షేక్ మెహబూబ్‌అలీకి చెందిన రేకుల షెడ్ దగ్ధమైంది. రూ.3.60 లక్షల నగదు, 5 కాసుల బంగారం ఇంటి సామగ్రి కాలి బూడిదయ్యాయని బాధితులు తెలిపారు. స్థానికులు మంటలను అదుపు చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.

నాటు తుపాకీ కలిగిన వ్యక్తి అరెస్టు



కైకలూరు, ఏప్రిల్ 4: నాటు తుపాకీ కలిగిన వ్యక్తిని అరెస్టు చేసి తుపాకీని స్వాధీనం చేసుకున్నామని కైకలూరు రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. గురువారం శీతనపల్లిలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన వెల్లూరు జిల్లా సింగవరం గ్రామానికి చెందిన ఎస్.విజయన్ వద్ద తుపాకీలు ఉన్నాయని వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న తుపాకీని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పాలకొల్లులో మహిళల కొట్లాట

పాలకొల్లు టౌన్, ఏప్రిల్, 4 : పాలకొల్లు రామయ్యహాల్ ప్రాంతంలో మతపరమైన తగాదాలు రోజురోజుకు రాసుకుంటున్నాయి. గురువారం వాటర్ ట్యాంక్ దగ్గర నీళ్ల పట్టుకుంటున్న నాగలక్ష్మి అనే మహిళపై వలంటీర్ మంజు, ఇద్దరు మహిళలు దాడి చేశారు. ఈ ఘటనలో నాగలక్ష్మికి చేతికి, మెడకు గాయాలవడంతో పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. రానున్న ఉగాది, శ్రీరామనవమి సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ నాగలక్ష్మి, కొందరు మహిళలు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. గతంలో రామయ్యహాల్ ప్రాంతంలో అమ్మవారి విగ్రహం నెలకొల్పేందుకు ఈమె ప్రయత్నం చేసింది. అప్పటి నుంచీ ఈ ప్రాంతంలో మతపరమైన వివాదం నడుస్తున్నది. నాగలక్ష్మి మాట్లాడుతూ తనపై కక్ష కట్టి దాడి చేశారని ఆరోపించింది. విశ్వహిందూ పరిషత్ నాయకులు మహిళా నాయకులు ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న నాగలక్ష్మిని పరామర్శించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాటర్ ట్యాంక్ వద్ద జరిగిన తగువు మాత్రమేనని పోలీసులు తెలిపారు.

ఎంపీ రఘురామకు ఘనస్వాగతం



పిప్పరలో రఘురామ కృష్ణంరాజుకు గజమాల వేస్తున్న టీడీపీ నాయకులు

గణపవరం, ఏప్రిల్ 4: విజయవాడ నుంచి పిప్పర మీదుగా భీమవరం వెళ్తున్న ఎంపీ రఘురామకృష్ణం రాజుకు పిప్పరలో టీడీపీ నాయకులు క్రేన్ సాయంతో గజమాల వేసి ఘనస్వాగతం పలికారు. కార్యకర్తలు, అభిమానులతో మూడురోడ్ల కూడలి కిటకిటలాడింది. మండల టీడీపీ అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు, గణపవరం పట్టణ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్ర కుమార్ రాజు, పట్టణ యువత అధ్యక్షుడు కాపారం చిన్న, ఇందుకూరి మారిరాజు, దండు రామచంద్రరాజు, కొలనువాడు శ్రీనివాసరాజుపాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: విజయవాడ నుంచి తాడేపల్లిగూడెం మీదుగా భీమవరం వెళ్తున్న ఎంపీ రఘురామకృష్ణంరాజుకు గురువారం తాడేపల్లిగూడెం పోలీస్ ఐలాండ్ వద్ద టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, ఉమ్మడి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వలవల బాబ్జి శాలువా. పుష్పగుచ్ఛం అందజేసి రఘురామను సత్కరించారు.

ఉండి: నరసాపురం పార్లమెంటు సభ్యుడు కనుమూరు రఘురామకృష్ణంరాజుకు ఉండిలో ఘన స్వాగతం లభించింది. గురువారం ఉండి-భీమవరం రహదారిలోని కోట్ల ఫంక్షన్ హాలులో నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు కన్నెగంటి రూత్‌కళ కుమారుడు వివాహానికి రఘురామ కృష్ణరాజు, ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

దత్తసాయికి వెండి కిరీటం బహూకరణ



మొగల్తూరు, ఏప్రిల్ 4: మొగల్తూరు రామాలయం వీధిలో దత్తసాయి ఆలయంలో సాయినాధుడుకు భక్తులు రూ.90వేల విలువ గల వెండి కిరీటాన్ని గురువారం బహూకరించారు. గ్రామానికి చెందిన ఉపాధ్యాయురాలు గుడిమెట్ల శివ ప్రసాద్ సుజాత దంపతులు సుమారు కిలో బరువు గల ఈ కిరీటాన్ని ఆలయ నిర్వాహకులు శెట్టి మోహనరావుకు అందించారు. గురువారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక హారతులు ఇచ్చి అన్న సమారాధన ఏర్పాటు చేయగా వందలాది మంది భక్తులు స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కన్నుల పండువగా పల్లాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారిని దర్శించుకున్న స్వతంత్ర అభ్యర్థి శివరామరాజు

కాళ్ళ, ఏప్రిల్ 4 : పెదఅమిరంలో గ్రామ దేవత పల్లాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ గురువారం కన్నుల పండువగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో నూతన విగ్రహం ప్రారంభోత్సవం కార్యక్రమంలో గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, జనసేన ఉండి ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామంలో అఖండ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, కోరా రామ్మూర్తి, వేగేశ్న జయ రామకృష్ణంరాజు, జువ్వాది సత్యనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వేడుకగా ధ్వజ స్తంభ పునః ప్రతిష్ఠ



ఆచంట, ఏప్రిల్ 4: పెనుమంచిలి శివాలయం ధ్వజ స్తంభ పునః ప్రతిష్ఠ కార్యక్రమాలు మూడు రోజులుగా జరుగుతున్నాయి. గురువారం ధ్వజ స్తంభ కార్యక్రమంతో పాటు పలు విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు కూడా వేడుకగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు. హోమాలు నిర్వహించి అనంతరం ధ్వజ స్తంభ పునః ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది.

75శాతం పింఛన్లు పంపిణీ

నరసాపురం రూరల్, ఏప్రిల్ 4: మండలంలోని 28గ్రామాల్లో ఇప్పటి వరకు 75శాతం లబ్ధిదారులకు పింఛన్లు అందించినట్లు ఎంపీడీవో రమణరావు తెలిపారు. గురువారం ధర్భరేవు, వేములదీవి, లక్ష్మణేశ్వరం సచివాలయాల కేంద్రాలను పరిశీలించారు. లబ్ధిదారులకు అందిస్తున్న పింఛన్ల తీరును అడిగి తెలుసుకున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికి న్యాయవాదుల సన్మానం

నరసాపురం టౌన్, ఏప్రిల్ 4: కాంగ్రెస్ అభ్యర్థి కానూరి బుజ్జిని గురువారం న్యాయవాదులు సన్మానించారు. న్యాయవాదిగా కొనసాగుతూ కాంగ్రెస్ పార్టీలో 20ఏళ్లుగా బుజ్జి కొనసాగుతున్నారు. తొలిసారి ఎన్నికల బరిలో నిలబడ్డ ఆయన్ను తోటి న్యాయవాదులంతా సత్కరించారు. పార్టీలకు అతీతంగా విజయం కోసం ప్రచారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో చల్లా దానయ్యనాయుడు, క్రాంతికుమార్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్వర్డ్‌బ్లాక్ అభ్యర్థిగా దండు శ్రీనివాసరాజు

భీమవరం అర్బన్, ఏప్రిల్ 4: భీమవరం అసెంబ్లీ ఎన్నికలలో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా దండు శ్రీనివాసరాజు పోటీచేస్తున్నారని జిల్లా కార్యదర్శి లంక కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఏపార్టీతో తమకు పొత్తులు లేవని, మరికొన్ని స్థానాలలో అభ్యర్థులు పోటీ చేయటానికి సంప్రదింపులు జరుగుతున్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఫోన్‌నెంబరు 99496 36885ను సంప్రదించాలన్నారు.


అర్బన్ సొసైటీ 9శాతం డివిడెండ్

నరసాపురం, ఏప్రిల్ 4; నరసాపురం అర్బన్ సొసైటీ గత ఏడాది రూ. 1.11 కోట్ల లాభాలు ఆర్జించినట్టు సొసైటీ అధ్యక్షులు ద్వారా హేమకుమార్ చెప్పారు. గురువారం సొసైటీ భవనంలో జరిగిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకు చరిత్రలో రికార్డు స్థాయిలో రూ.53 కోట్ల టర్నోవర్ గత ఏడాది జరిగిందన్నారు. రూ.22 కోట్ల డిపాజిట్లు సేకరించగలిగామన్నారు. వచ్చిన లాభంలో సంఘం సభ్యులకు 9శాతం డివిడెంట్ ఇవ్వాలని బోర్డు తీర్మానించింది. కార్యక్రమంలో సభ్యులు మాదాసు గోపాలకృష్ణ, బళ్ల సత్యనారాయణ, కట్టా సత్యనారాయణ, పెదపట్నం శ్రీనివాస్, కస్తూరి శ్రీను, మస్తాన్, కార్యదర్శి పెద్దింటి కేశవాచార్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 4: సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహనతో అప్రమత్తంగా ఉంటే వ్యాధులు దరిచేరవని మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని నందమూరు. ఆరుళ్ల గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పాఠశాల విద్యార్థులకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.

రోడ్డు షోకు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్‌వో స్వామి నాయుడు

ఆచంట, ఏప్రిల్ 4: రోడ్డు షో నిర్వహించే అభ్యర్థులు ముందస్తు అనుమతి తీసుకోవాలని రోడ్డు షోలో సెలవు దినాల్లో మాత్రమే నిర్వహించాలనిఆసుపత్రి, బ్లడ్ బ్యాంక్స్, ఎక్కువ రద్దీగా ఉండే మార్కెట్‌లు వద్ద నిర్వహించకూడదని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వంటెద్దు స్వామి నాయుడు అన్నారు. గురువారం స్థానిక ఎన్నికల కార్యాలయం వద్ద స్టాడింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్ని వెహికల్స్, ఎంత మంది ర్యాలీలో పాల్గొంటున్నారు. అనే విషయాన్ని వెహికల్ నెంబర్లుతో సహా ముందస్తు తెలపాలన్నారు. ర్యాలీ రోడ్డులో సగ భాగము మాత్రమే నిర్వహించాలని ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా నిర్వహించాలని కాన్వాయిలో పది వాహనాలు మాత్రమే ఉండాలని ప్రతీ పది వాహనాలకు వంద మీటర్లు దూరం ఉండాలన్నారు. ర్యాలీలో బాణ సంచా వినియోగించ కూడదని అన్నారు.









తణుకులో టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి ప్రచారం.. నరసాపురంలో విలేకరులతో మాట్లాడుతున్న కొత్తపల్లి.. చిత్రంలో అభ్యర్థులు నాయకర్, వర్మ.. తాడేపల్లిగూడెంలో వలవల బాబ్జి, బొలిశెట్టి శ్రీనివాస్, ఈతకోట తాతాజీలను సత్కరించిన ఎస్సీ సెల్ నాయకులు... ఆకివీడులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రామరాజు సతీమణి సుష్మ

వైసీపీ పాలనలో రాష్ట్రం నాశనం : ఆరిమిల్లి

జిల్లాలో ఊపందుకున్న కూటమి అభ్యర్థుల ప్రచారం

తణుకు, ఏప్రిల్ 4 : వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వ నాశనమైందని తణుకు టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కూటమి నాయకులు కలగర వెంకటకృష్ణ, పరిమి వెంకన్నబాబు, తమరాపు రమణమ్మ, మదనపూడి రామకృష్ణ, కోళ్ళ ఆనందరావు, తమరాపు సత్యనారాయణ, ఈశ్వరరావు, ఒమ్మిరాంబాబు, కడియాల సూర్యనారాయణ, చిక్కాల వేణు, తదితరులు పాల్గొన్నారు. తణుకు పట్టణంలోని 27వ వార్డులో ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

పింఛన్ల పంపిణీపై వైసీపీ కుట్ర

పింఛన్ల పంపిణీపై వైసీపీ నాయకులు కొత్తగా కుట్రలకు పాల్పడుతూ దుష్ప్రచారం చేస్తున్నారని ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వలంటరీ వ్యవస్థకు తాము వ్యతిరేకం కాదని చెప్పారు. వలంటరీ వ్యవస్థ ద్వారా పింఛన్లు పంపిణీ చేయవద్దని మాత్రమే ఎన్నికల సంఘం చెప్పిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో 1.26 లక్షల గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పనిచేస్తున్నారని, ఒక్కో ఉద్యోగికి సగటున 45 మంది లబ్ధిదారులు ఉంటారన్నారు. రెండు రోజుల్లో పింఛన్ల పంపిణీకి అవకాశం ఉన్నప్పటికీ వైసీపీ కావాలనే దురుద్దేశంతో వ్యవహరిస్తుందని ఆరోపించారు.

- టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణను గెలిపించుకుంటామని పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలు అన్నారు. గురువారం సాయంత్రం తణుకులోని అత్తిలి మండలం మంచిలి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు పార్టీని వీడి ఆరిమిల్లి సమక్షంలో టీడీపీలో చేరారు. కూటమి తరపున రాధాకృష్ణను గెలిపించుకుంటామన్నారు.

'వృద్ధుల మరణానికి జగనే కారణం'

నరసాపురం, ఏప్రిల్ 4 : పింఛన్లు తీసుకొనేందుకు వచ్చిన నలుగురు వృద్ధులు ఎండలకు చనిపోవడానికి సీఎం జగనే కారణమని టీడీపీ జోన్ ఇన్‌చార్జ్ మద్దలపు రవికుమార్ ఆరోపించారు. గురువారం నరసాపురం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఉద్దేశ పూర్వకంగానే పింఛన్లకు ఇవ్వాల్సిన సొమ్మును తమకు ఇష్టమైన కాంట్రాక్టర్లకు చెల్లించి, వైసీపీ రాజకీయం చేయడం దారుణమన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్పదన్నారు. ఎంపీ అభ్యర్థి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి ఎన్డీఏ కూటమితోనే సాధ్యమన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ అభివృద్ధి చేయకుండా శిలా ఫలకాలతో ప్రజల్ని దగా చేసిన ఘనత ముదునూరి ప్రసాదరాజుదేనన్నారు. ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు మాట్లాడుతూ చంద్రబాబు సభకు పెద్ద ఎత్తున జన సమీకరణ చేస్తున్నామన్నారు. నరసాపురం పార్లమెంట్‌లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు భారీ మెజార్టీ ఖాయమన్నారు. చాగంటి మురళీ, జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవి, పీవీఆర్, నార్ని తాతాజీ, మేకల సతీష్, సంకు భాస్కర్, మల్లాడి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

భీమవరం టౌన్, ఏప్రిల్ 4 : 36వ వార్డు నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు సుమారు 30 మంది జనసేన ఉమ్మడి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు సమక్షంలో జనసేనలో చేరారు. వారికి పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చంద్ర శేఖర్, పట్టణ ప్రధాన కార్య దర్శి సుంకర రవి, మాజీ కౌన్సిలర్స్ మాగాపు ప్రసాద్, వానపల్లి సూరిబాబు, బంగార్రాజు, రామాయణం శ్రీను పాల్గొన్నారు.

నరసాపురం రూరల్: రుస్తుంబాదా మంగళగుంట పాలెంకు చెందిన వైసీపీ కార్యకర్తలు జనసేనలోకి చేరారు. కడలి వేణు, శ్రీను, సాంబశివరావు, కొండల స్వామి, వెంకట సత్యనారాయణ, పెంటయ్య, సూరయ్య, నారాయణస్వామిలతో పాటు మరికొంద మంది చేరారు. వీరందరికీ కన్వీనర్ బొమ్మిడి నాయకర్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

కూటమి ప్రభుత్వంతోనే ప్రజలకు మేలు : సూర్యకుమారి

యలమంచిలి, ఏప్రిల్ 4: రాష్ట్రంలో అధికారంలోకి రాబోయే ఉమ్మడి కూటమి ప్రభుత్వంలో అమలు జరిగే పథకాలతోనే ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు సతీమణి సూర్యకుమారి అన్నారు. మండలంలోని పెనుమర్రు గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపి శ్రేణులతో కలిసి నిమ్మల సూర్యకుమారి గురువారం ఇంటింటా ప్రచారం చేశారు. నిరంతరం ప్రజలతో మమేకమై నిబద్ధతతో పనిచేసే ఎమ్మెల్యే రామానాయుడుకు మరోసారి విజయాన్ని అందిచాలని ఆమె ప్రజలను కోరారు.

చంద్రబాబు సీఎం కావడం తథ్యం: నాయకర్

మొగల్తూరు, ఏప్రిల్ 4: తెలుగుదేశం అధినేత చంద్రబాబు రాష్ట్ర ముఖ్యమంత్రి కావడం తథ్యమని నరసాపురం జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ అన్నారు. గురువారం మొగల్తూరు పంచాయతీ పరిధి కడలివారిపాలెంలో జనసేన, టీడీపీ, బీజేపీ కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసమే మూడు పార్టీలు కూటమిగా ఏర్పడ్డాయని ఎలాంటి స్వలాభానికి కాదని ఆయన వివరించారు. వైసీపీ అరాచక పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని అన్నారు.

ధర్మపోరాటంలో కూటమిదే విజయం: కొత్తపల్లి

నరసాపురం టౌన్, ఏప్రిల్ 4: ధర్మానికి... అధర్మానికి జరిగే పోరాటంలో కూటమి బలపర్చిన అభ్యర్థులే విజయం సాధిస్తారని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. గురువారం రాత్రి జనసేన నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసమే కూటమి ఏర్పడిందన్నారు. ఐదేళ్ళ వైసీపీ పాలనలో అంతా దోపిడీనే జరిగిందన్నారు. జనసేన అభ్యర్థి నాయకర్ మాట్లాడుతూ శుక్రవారం నియోజకవర్గంలో చంద్రబాబు చేపడుతున్న యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు ఎంపీ అభ్యర్థి వర్మ కొత్తపల్లిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జానకీరామ్, వన్నెంరెడ్డి శ్రీను, వైఎస్ బాబులు, పీవీఆర్, దొండపాటి స్వామి పాల్గొన్నారు.

వలంటీర్లకు టీడీపీ వ్యతిరేకం కాదు: శిరిగినీడి

నరసాపురం, ఏప్రిల్ 4: గ్రామ వలంటీర్ వ్యవస్థకు తెలుగుదేశం పార్టీ వ్యతిరేకం కాదని జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయాలు చేసే వలంటీర్లు మాత్రమే టీడీపీకి వ్యతిరేకమన్నారు. వలంటీర్లను రెచ్చగొట్టి ముఖ్యమంత్రి జగన్ రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులే లబ్ధిదారుల ఇళ్ళకు వెళ్ళి పింఛన్ పంపిణీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినా ముఖ్యమంత్రి ఎందుకు బేఖాతర్ చేస్తున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వృద్ధులు, వితంతువులు, వికలాంగులు అధైర్యపడాల్సిన అవసరం లేదని వారి ఇళ్ళకు వెళ్ళి నెలకు రూ.4వేలు చొప్పున పింఛన్‌లు అందిస్తామన్నారు.



పెనుమర్రులో ప్రచారం చేస్తున్న నిమ్మల సూర్యకుమారి

బొలిశెట్టిని భారీ మెజారిటీతో గెలిపించాలి

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 4 : నియోజకవర్గంలో అవినీతి పాలన అంతమొందించాలంటే ఉమ్మడి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. గురువారం పట్టణంలోని స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద టీడీపీ, జనసేన, బీజేపీ ఎస్సీ సెల్ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్సీలకు వైసీపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని, వారికి రావాల్సిన పథకాలన్నీ రద్దు చేసిందన్నారు. అనంతరం వలవల బాబ్జి, బొలిశెట్టి శ్రీనివాస్, ఈతకోట తాతాజీలను సత్కరించారు. ముప్పిడి రమేష్, పీతల సత్యనారాయణ, యాండ్రపాటి రాజు, జి.సాల్మన్, ఆయా పార్టీల ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు

పెంటపాడు: వైసీపీ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి శూన్యమని కూటమి ఉమ్మడి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం పెంటపాడు గ్రామంలో ఎన్నికల శంఖారావం కార్యక్రమాన్ని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీలతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రజలందరూ ఉమ్మడి కూటమికి పట్టం కట్టాలని కోరారు. వలవల బాబ్జి మాట్లాడుతూ దోచుకోవడం దాచుకోవడమే వైసీపీ ముఖ్య ఉద్దేశమన్నారు. కిలపర్తి వెంకట్రావు, పుల్లా బాబి, దత్తు ప్రసాద్, పాతూరి రాంప్రసాద్‌చౌదరి, బండి పెద్దిరాజు, కసిరెడ్డి మధులత తదితరులు పాల్గొన్నారు.

వైసీపీవి స్వార్థ రాజకీయాలు: సుష్మ

ఆకివీడు, ఏప్రిల్ 4:స్వార్థ రాజకీయాల కోసం పింఛన్‌దారుల ప్రాణాలతో వైసీపీ నాయకులు చెలగాటమాడుతున్నారని ఎమ్మెల్యే మంతెన రామరాజు సతీమణి సుష్మ అన్నారు. గురువారం 13,15 వార్డులలో ఆమె ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఉద్యోగులతో పింఛన్లు ఇంటింటికి వెళ్ళి పంపిణీ చేయించలేరా అన్నారు. కావాలనే సచివాలయాలకు అవ్వాతాతలను రప్పించి పింఛన్లు అందజేస్తున్నారన్నారు. ఖజానాలో డబ్బులు లేకనే ఈ నెల 4వ తేదీన పంపిణీ చేయడం జరిగిందన్నారు. అవ్వాతాతలతో పాటు ప్రజలందరికీ వైసీపీ మోసాలు తెలుసునన్నారు.

వృద్ధులకు వసతులు కల్పించకపోవడం దారుణం

ఆకివీడు, ఏప్రిల్ 4: సచివాలయాలకు పెన్షన్లు తీసుకోవడానికి వచ్చిన అవ్వాతాతలకు అధికారులు సరైన వసతులు ఏర్పాటు చేయకపోవడం దుర్మార్గమని టీడీపీ మండలాధ్యక్షు డు మోటుపల్లి రామవర ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా నేటికి కొంతమంది అధికారులు వైసీపీకి తొత్తుగానే వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ నెల మాదిరిగానే ఈ నెల కూడా ఇళ్ళకు పెన్షన్లు తీసుకెళ్ళి ఇవ్వాలని తాము కోరినా సచివాలయాల దగ్గర ఇవ్వడం చూస్తుంటే జగన్ ఆడిస్తున్న నాటకంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్ష-కార్యదర్శి బొల్లా వెంకట్రావు, గంధం ఉమా, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి తదితరులు ఉన్నారు. దీనిపై నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమ్మోహన్‌ను ప్రశ్నించగా పెన్షన్లు పంపిణీ దగ్గర గురువారం ఉదయం కొంచెం ఇబ్బందులు తలెత్తినా తరువాత కుదుటపడ్డాయన్నారు. 80 శాతం పెన్షన్లు పంపిణీ చేశామన్నారు.

11 గంటల వరకూ పడిగాపులే

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 4 : పింఛన్ల పంపిణీ గురువారం ఉదయం పదకొండు గంటల వరకు మొదలు కాలేదు. బుధవారం కొన్ని గ్రామాలకు అరకొర సొమ్ము పంచాయతీల ఖాతాలకు జమ చేయగా వాటిని రాత్రి పంపిణీ చేసి మళ్లీ సచివాలయ సిబ్బంది గురువారం ఉదయం బ్యాంకుల వద్ద పడిగాపులు కాసిన అనంతరం ఆ సొమ్ము పంపిణీ ప్రారంభించారు. ఉదయం 11 గంటల వరకు పింఛన్‌దారులు పడిగాపులు కాయాల్సి వచ్చింది.

సొసైటీ సీఈవోగా శ్రీనివాసరావు



సీఈవోగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావును అభినందిస్తున్న ఉద్యోగులు

ఆకివీడు, ఏప్రిల్ 4: ది కో-ఆపరేటివ్ సొసైటీ రూరల్ బ్యాంకు సీఈవోగా గురువారం తోట శ్రీనివాసరావు (బాబి) బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పనిచేసిన తో ట సతీష్ పదవీ విరమణ చేశారు.

వలంటీర్లు రాజీనామా

ఆచంట, ఏప్రిల్ 4: ఆచంట మండలంలో అన్ని గ్రామాల్లో ఇప్పటి వరకు 189 మంది వలంటీర్లు రాజీ నామా చేసినట్లు ఎంపీడీవో పి. నరసింహ వర ప్రసాద్ బాబు తెలిపారు. మండలంలో 290 మంది వలంటీర్లు ఉన్నారు.

ఆకివీడు: నగర పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న 12 మంది వలంటీర్లు రాజీనామ చేసినట్లు ఎంపీడీవో వై.రామకృష్ణ తెలిపారు. పట్టణ పరిధిలోని రెండు, మూడు సచివాలయాలకు సంబంధించిన వలంటీర్లు బుధవారం రాత్రి తొమ్మిది మంది, గురువారం ఐదుగురు రాజీనామా చేశారన్నారు.


బడిఈడు పిల్లలను స్కూళ్లలో చేర్పించాలి

పెంటపాడు, ఏప్రిల్ 4 : బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని హెచ్‌ఎం ద్వారంపూడి శ్రీలక్ష్మి అన్నారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా గురువారం మండలంలోని కె.పెంటపాడులో అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా ఐదేళ్లు నిండిన పదహారు మందిని పాఠశాలలో చేర్చుకున్నామని హెచ్‌ఎం తెలిపారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు జగదీశ్వరి, దేవి, వేణు, అంగన్వాడీలు విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెంటపాడు, ఏప్రిల్ 4 : జువ్వలపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఎలక్ట్రికల్ డీఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈమేరకు ప్రత్తిపాడు గ్రామంతో పాటు బి.కొండేపాడు ఇండస్ట్రీస్‌కు కరెంట్ సరఫరాని నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ సహకరించాలని కోరారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ దొమ్మేటి మృతి



పెనుగొండ, ఏప్రిల్ 4: పెనుగొండ పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న దొమ్మేటి శ్రీనివాస్ (56) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. శ్రీనివాస్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. గురువారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

78 శాతం పింఛన్‌లు పంపిణీ

ఆచంట, ఏప్రిల్ 4: మండలంలో 8287 మంది పింఛన్ దారులకు గాను గురువారం నాటికి 6173 మందికి పింఛన్‌లు ఇవ్వగా అంటే 78 శాతం పింఛన్‌లు ఇవ్వడం జరిగిందని ఎంపీడీవో పి.నరసింహ వర ప్రసాద్ తెలిపారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

ఆకివీడు, ఏప్రిల్ 4: పట్టణంలో తాగునీరు సరఫరా విషయంలో అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని టీడీపీ కౌన్సిలర్ మోపిదేవి సత్యవతి ఆగ్రహించారు. తహసీల్దార్ కార్యాలయం సమీపంలో వాటర్ ట్యాంకు ఫిల్టర్ బెడ్ దగ్గర మోటారు చెడిపోవడంతో గురువారం ఉదయం,సాయంత్రం నగర పంచాయతీ కుళాయిల ద్వారా మాదివాడ, శ్రీరామపురం, అమృతరావునగర్ కాలనీ, జానకినగర్ ఏరియాలకు తాగునీరు సరఫరా నిలచిపోయిందన్నారు. వేసవి సమీపిస్తుండడంతో ముందుగానే ఇటువంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చూసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కమిషనర్ కృష్ణమోహన్‌ను ఆంధ్రజ్యోతి ప్రశ్నించగా ఆయా ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా పంపించడం జరుగుందన్నారు.

కుముదవల్లి, గొల్లలకోడేరులో శివ ప్రచారం



కుముదవల్లిలో శివకు పూలమాల వేసిన గ్రామస్థులు

పాలకోడేరు, ఏప్రిల్ 4 : కుముదువల్లి, గొల్లలకోడేరు గ్రామాల్లో స్వతంత్ర అభ్యర్థి శివరామరాజు గురువారం నాడు ప్రచారం చేశారు. ప్రతీ గ్రామంలో సమస్యలు తనకు తెలుసని, తాను గెలిచిన వెంటనే ఆ సమస్యలన్నీ పరిష్కరిస్తానన్నారు. నిరుపేదలకు తమ సంస్థ ద్వారా వైద్యసేవలు అందిస్తానన్నారు. భూపతిరాజు శ్రీనివాసరాజు, బుద్ధరాజు బలరామరాజు, భూపతిరాజు వెంకట సుబ్బరాజు, భూపతిరాజు రాంబాబు, కటారి సూర్యనారాయణరాజు, కాజ వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఉండి: ఎన్ఆర్‌పిఅగ్రహారంలోని దళితులపేట, ఆయిల్ ఫ్యాక్టరీ, టీకోర్టు సెంటర్‌లలో స్వతంత్ర అభ్యర్థి వేటుకూరి శివరామరాజు ప్రచారం నిర్వహించారు. ఆప్రాంతంలో వున్న మహిళలు, పెద్దలతో శివరామరాజు మాట్లాడారు. ఉండి-భీమవరం రోడ్‌లోని టికోర్టు వద్ద మండల టీడీపీ అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాగిత బుజ్జిలు కరచాలనం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ సాగిరాజు సాంబశివరాజు, ముదుండి వెంకట్రాజు, నాయకులు మోపిదేవి శ్రీను, బురిడి రవిబాబు పాల్గొన్నారు. ఉండి-భీమవరం రోడ్‌లోని నియోజకవర్గం తెలుగుమహిళ అధ్యక్షరాలు కన్నెగంటి రూత్‌కళ కుమారుని వివాహానికి వెళ్లి వధువరులను ఆశీర్వదించారు.

ఓబీసీ జిల్లా మోర్చ అధ్యక్షునిగా పుల్లాజీ



పుల్లాజీకి నియామకపత్రం అందిస్తున్న దృశ్యం

భీమవరంటౌన్,ఏప్రిల్ 4 : భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా జిల్లాకమిటీని గురువారం నాడు పార్లమెంట్ బీజేపీ కార్యాలయంలో ఎన్నుకున్నారు ఈ కమిటీలో జిల్లా అధ్యక్షుడిగా గున్నేపల్లి పుల్లాజిని నియమిస్తూ రాష్ట్ర ఓబీసీ అధ్యక్షుడు గోపి శ్రీనివాస్ ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు తాతాజీ, పీవీఎస్ వర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి దుర్గరాజు మిగిలిన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

13వ వార్డు టీడీపీ ఇన్‌చార్జిగా సాంబ

ఆకివీడు, ఏప్రిల్ 4: నగర పంచాయతీ పరిధిలోని 13వ వార్డు టీడీపీ ఇన్‌చార్జిగా అల్లు సాంబను నియమించినట్లు పట్టణ అధ్యక్షుడు బొల్లా వెంకట్రావు గురువారం తెలిపారు. ఇప్పటి వరకూ పనిచేసిన సుబ్బారావు మరో చోటకు వెళ్ళడంతో అతనిని తప్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, పట్టణ కార్యదర్శి గంధం ఉమా, మీసాల రవి, కిమిడి నాగరాజు, దూబ సురేష్, సుబ్బారెడ్డి, అజయ్‌గౌడ్, శేషు తదితరులు ఉన్నారు.

సెయింట్ మేరిస్‌లో పాలియేటివ్ కేర్ సెంటర్

భీమవరం క్రైం, ఏప్రిల్ 4 : దీర్ఘకాలిక వ్యాధులు, క్యాన్సర్ వంటి వైద్య సేవల కోసం భీమవరం సెయింట్ ఆసుపత్రిలో పాలియేటివ్ కేర్ సెంటర్‌కు అనుమతి మంజూరైందని ఆసుపత్రి సూపరింటెండెంట్ సిస్టర్ మేరీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనితా తెలిపారు. గురువారం డీఎంహెచ్‌వో డా.ఉమా మహేశ్వరరావును వారు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారు మాట్లాడుతూ నొప్పి లేకుండా వైద్యంతో పాటు కౌన్సెలింగ్ కూడా అందిస్తామని, దాతల సహకారంతో ఆరు నెలల్లోనే ఈ కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తామన్నారు. పాలియేటివ్ కేర్ మెడిసిన్‌లో నిష్ణాతులైన వైద్యులు డాక్టర్ సిమిలిను నియమించామని అన్నారు. సలహాదారులు చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

ప్రజాగళం సభకు రావాలని బొట్టు పెట్టి పిలుపు



బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్న టీడీపీ మహిళా ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి

పాలకొల్లు టౌన్, ఏప్రిల్ 4: పాలకొల్లులో జరిగే చంద్రబాబు ప్రజాగళం బహిరంగ సభకు రావాలని రాష్ట్ర టీడీపీ మహిళా ఉపాధ్యక్షురాలు కర్నేన రోజా రమణి, జిల్లా టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు దంపతులు 7, 8 వార్డుల్లో ఇంటింటి కీ బొట్టు పెట్టే కార్యక్రమం నిర్వహించారు. రోజారమణి మహిళలకు బొట్టు పెట్టి ప్రజాగళం సభకు రావాలని ఆహ్వానించారు. గౌరునాయుడు పురుషులతో కరచాలనం చేసి ఆహ్వానించారు.

రైతులకు అందని తుఫాన్ నష్టపరిహారం

భీమవరం రూరల్, ఏప్రిల్ 4 : జిల్లాలో సార్వా పంటకు మిచౌంగ్ తుఫాన్ వలన పంట కోల్పోయిన కౌలు రైతులు, రైతులకు ప్రభుత్వం విడుదల చేసిన పంట నష్టపరిహారం జిల్లాలో ఏ ఒక్క రైతుకి అందలేదని కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు అన్నారు. సార్వా పంట సమయంలో సంభవించిన మిచౌంగ్ తుఫాన్‌కి జిల్లాలోని 20 మండలాల్లో 15564 హెక్టార్లలో పంట దెబ్బతిందని, వ్యవసాయ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపారన్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వం 31673 మంది రైతులు, కౌలు రైతులకు 26 కోట్లు 22 లక్షల రూపాయిల పంట నష్టం విడుదల చేశామని గత నెలలో ప్రకటించిందన్నారు. అయినా ఇంత వరకు ఒక్క రైతుకి కూడా పంట నష్టపరిహారం జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వాసవి కాలేజీలో 'సాంకేతిక ఉత్సవం'



విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 4: పెదతాడేపల్లి వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన సాంకేతిక ఉత్సవం విద్యార్థుల ఆట పాటలతో హోరెత్తింది. రెండు రోజుల పాటు స్పెక్ట్రా 2కె-24 పేరుతో నిర్వహించిన సాంకేతిక ఉత్సవంలో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు అబ్బురపరిచాయి. అనంతరం విద్యార్థుల నృత్యాలు, ఆటపాటలు ఆకట్టుకున్నాయి. ఈ ఉత్సవానికి సినీ ప్రమోషన్ కోసం పొట్టేళ్ల చిత్ర బృందం విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ విజేతలకు బహుమతులు అందించారు.

ఎన్నికల నియమావళి స్టిక్కర్లు పంపిణీ

భీమవరం టౌన్, ఏప్రిల్ 4 : ఎన్నికల్లో ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా ఓట్లు వేయాలని చైతన్య ఆటో యూనియన్ అధ్యక్షుడు పంపన గోపి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఓటు విలువ ప్రాముఖ్యత-ఎన్నికల నియమావళి స్టిక్కర్లను పట్టణంలోని 250 ఆటోలకు స్టిక్కరింగ్ చేసే కార్య క్రమాన్ని నిర్వహించారు. గోపి మాట్లాడుతూ ఆటో కార్మికులు ఈ స్టిక్కర్ల కార్యక్రమంలో భాగస్వాములై ప్రయాణికులకు ఓటు విలువ తెలియచేస్తామని అన్నారు. యూనియన్ నాయకులు సోమేశ్వరరావు, శ్రీనివాస్, రాము, సత్తిబాబు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.